# అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నాం..
- రోడ్ల విస్తరణలో నష్టపోయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లిచ్చాం..
- 90శాతం పూర్తయిన రోడ్ల విస్తరణ పనులు
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వెల్టూరులో పర్యటించి జిల్లా కేంద్రంలోని 3, 4వ వార్డులో ప్రచారం ప్రారంభించిన మంత్రి

వనపర్తి, అక్టోబర్ 17 : వనపర్తి అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్ తరాల కోసం గట్టి పునాదులు నిర్మిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలహనుమాన్ ఆలయం, కాళీమాత భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం 3,4 వార్డుల్లో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనపర్తిలో నెలకొన్న సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. అందులో భాగంగా పట్టణ రోడ్డు విస్తరణలో నష్టపోయిన 800మంది బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందించామన్నారు. వీరితోపాటు మరో 700మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేశామన్నారు. జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ పనులు గత 40ఏండ్లు కలగానే ఉండేదని, ఆ సమస్య తీర్చడానికి ప్రజలకు నచ్చజెప్పి రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించి 90శాతం పూర్తి చేశామని తెలిపారు. అలాగే పట్టణ శివారులో ఉన్న ఐదు చెరువులను పునరుద్ధరించి పట్టణానికి ప్రత్యేక శోభ తీసుకొచ్చామన్నారు. పట్టణంలో లోఓల్టేజీ సమస్యలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో వనపర్తి భవిష్యత్‌కు గట్టి పునాదులు వేసేందుకు అభివృద్ధి చూసి అండగా నిలవాలని కోరారు. అనంతరం 3వ వార్డులోని వార్డు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే జిల్లా కేంద్రంలోని 7వవార్డులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి పాల్గొని బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్, పార్టీ పట్టణ ఇన్‌చార్జి అరుణాప్రకాశ్, కౌన్సిలర్లు సమద్, పుట్టపాకుల మహేశ్, బండారు కృష్ణ, విభూతి నారాయణ పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి


జిల్లా కేంద్రంలోని 7 వవార్డులోని నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సింగిరెడ్డి వాసంతి

### పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

పెద్దమందడి, అక్టోబర్ 17: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కొనసాగాలంటే పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి వెల్టూరులో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి మంగళవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలో మిగిలిపోయిన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లెలు బాగుపడుతున్నాయన్నారు. ఒక ప్రణాళికతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్త సేకరణ, ఇతర అవసరాల కోసం ట్రాక్టర్, ట్యాంకర్, గ్రామపంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసి పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించినట్లు తెలిపారు. సాగునీటి రాకతో గ్రామాల స్వరూపం పూర్తిగా మారిందని గతంలో ఎక్కడ చూసినా బీడు భూములే ఉండేవన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సహకారంతో ప్రతి గ్రామానికి సాగునీరు తీసుకొచ్చి పాడిపంటలతో సస్యశ్యామలం చేశామన్నారు. గతంలో గ్రామాల్లో ఉపాధి లేక వలసలు వెళ్లేవారనిక ఇప్పుడు గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ చేతినిండా పనులు దొరుకుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మన వద్దకు వలసలు వచ్చి పనులు చేసుకుంటున్నారన్నారు. వెల్టూర్ గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువు కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యటనలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న చేనేత మగ్గాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య, గొర్రెల కాపరులు సంఘం డైరెక్టర్ నాగేంద్రయాదవ్, సతీశ్‌శర్మ, ఖాజా హుస్సేన్ ఉన్నారు.



## కేసీఆర్‌ను గెలిపిస్తాం.. రూ.5 వేల పింఛన్ తీసుకుంటాం

- మంత్రి నిరంజన్‌రెడ్డితో వృద్ధురాలు

పెద్దమందడి మండలం వెల్టూర్‌లో సోమవారం రాత్రి పల్లెనిద్ర చేసిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ వెళ్తుండగా.. అక్కడే ఉన్న కుమ్మరి గోవిందమ్మను చూసిన మంత్రి ఎలా ఉన్నావమ్మా.. అని అడిగారు. దీంతో ఆమె స్పందించి మాట్లాడుతూ సర్కారు ముసలోళ్లకు ఆసరాగా నిలిచింది.. సీఎం కేసీఆర్ సార్ పింఛన్ ఇస్తూ కన్నబిడ్డల్లా మా బాగోగులు చూస్తుండ్రు.. పింఛన్ డబ్బులు వస్తుండడంతో మా ఇంట్లో కొడుకులు, కోడండ్లు మమ్మల్ని బాగా చూ స్తుండ్రు. మళ్లీ కారు గుర్తుకే ఓటేసి కేసీఆర్ సార్‌ను గెలిపించుకుంటాం.. రాబోయే రోజుల్లో రూ.5 వేల పింఛన్ తీసుకుంటాం'.. అని సంతోషంగా తెలిపింది.

- వనపర్తి ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

## మ్యానిఫెస్టోను గడపగడపకూ వివరించాలి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, అక్టోబర్ 17 : బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రతి గడపకూ వివరించే బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రామకృష్ణ గార్డెన్‌లో మండలంతోపాటు పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హామీలు ఇవ్వకుండానే సీఎం కేసీఆర్ గతంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారన్నారు. పింఛన్ పెంపు, రూ.5లక్షల బీమా, సౌభాగ్య పథకంతో రూ.3వేలు, రూ.400లకే గ్యాస్ సిలిండర్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతూ అగ్ర వర్ణాల కోసం విద్యను అందించేందుకు 119 నియోజక వర్గాల్లో గురుకులాలను నెలకొల్పేందుకు మ్యానిఫెస్టోలో రూపొందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల శ్రీను, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, కౌన్సిలర్లు పద్మా అయ్యన్న, సంధ్యారవీందర్‌రెడ్డి, కొండారెడ్డి, రాములుయాదవ్, తిరుపతయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఖాజామైనుద్దీన్, బాబురెడ్డి, బాలకృష్ణ, ప్రసన్నలక్ష్మి, వాసుదేవారెడ్డి,వికాస్ పాల్గొన్నారు.

## వెల్టూర్ చెక్‌పోస్ట్ వద్ద భారీగా నగదు పట్టివేత

- రూ.26,50,600 స్వాధీనం

పెద్దమందడి, అక్టోబర్ 17 : మండలంలోని వెల్టూరు స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.26,50,600ను పోలీసులు పట్టుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం మండలంలోని వెల్టూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన రాజేశ్ ఎలాంటి పత్రాలు లేకుండా పెద్దమొత్తంలో డబ్బు తీసుకెళ్తుండడంతో పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. డబ్బు ఎక్కడికి తీసుకెళ్తున్నావని అని అడగగా వ్యాపార నిమిత్తం తీసుకెళ్తున్నట్లు సమాధానం ఇచ్చాడని తెలిపారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

## చంద్రఘంటాదేవీగా జోగుళాంబ


విజయలక్ష్మి అవతారంలో జ్ఞానసరస్వతి అమ్మవారు

అలంపూర్, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన అ లంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో జోగుళాంబ మంగళవారం చంద్ర ఘంటాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అర్చకులు నిత్య పూజా హోమాలు నిర్వహించిన అనంతరం యాగశాల, ఆలయానికి బలిహరణ సమర్పణ చేశారు. అనంతరం మాధ్యాహ్నిక అర్చన, నీరాజన మంత్ర పుష్పములు సమర్పించారు. అమ్మవారికి సహస్ర నామార్చన, కుంకుమార్చనలు, శ్రీచక్ర నవావరణార్చన, తర్వాత యాగశాలలో చండీహోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు నవాన్నసహిత మహానివేదన, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అమ్మవారికి ఏకాంత ప్రదోషకాల పూ జలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. రాత్రి 7 గంటలకు జోగుళాంబ చంద్ర ఘంటా దే వి అలంకరణలో కొలువుదీరి పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి దర్బారు సేవ, కుమారి సువాసినీ పూజలు నిర్వహిం చి మహా మంగళహారతి సమర్పించారు. ఉత్సవా ల సందర్భంగా పట్టణ పరిసరాలు ఆధ్యాత్మిక శోభ ను సంతరించుకున్నాయి. ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు ఏర్పాట్ల ను ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, అధికారులు పర్యవేక్షించారు.

### ధనలక్ష్మి అవతారంలో జములమ్మ..

గద్వాల రూరల్, అక్టోబర్ 17 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ అమ్మవారు దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8గంటలకు విశేష ఫలామృతాభిషేకం, 9గంటలకు పుష్పాలంకరణ సేవలు, మంగళహారతి అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్, ఆలయ డైరెక్టర్లు ఓంప్రకాశ్ కాంబ్లె, నాగరాజు, ఆలయ సిబ్బంది మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### విజయలక్ష్మి అవతారంలో..

ఇటిక్యాల, అక్టోబర్ 17 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీచుపల్లి క్షేత్రంలోని లక్ష్మీహయగ్రీవ సమేత జ్ఞానసరస్వతి అమ్మవారు విజయలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భం గా అమ్మవారికి అర్చకుడు దినకరాచారి సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, విజయలక్ష్మి అలంకర ణ, కుంకుమార్చన, నైవేద్యం, తీర్థప్రసాదాల ని వేదన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధం గా ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని మండపంలో కొలువుదీరిన అమ్మవారు మంగళగౌరి అవతారంలో పూజలందుకున్నారు.